క్లుప్తంగా

ముందస్తు 'రక్షాబంధన్'



సమావేశంలో మాట్లాడుతున్న స్వప్న

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్లలో బ్రహ్మకుమారి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి స్వప్న మాట్లాడుతూ రక్షా బంధన్ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ప్రేమకు నిదర్శనమన్నారు. రాఖీ పండుగను వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు పేర్లతో పిలుస్తారని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కవిత, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, సంస్థ సభ్యులు రాజు, జలజ, సురేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అందుబాటులో తపాలా సేవలు



మాట్లాడుతూన్న ఏఎస్పీ మదన్‌మోహన్

మద్దూరు(హుస్నాబాద్): తపాలాశాఖ ద్వారా ఎన్నో రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని, వాటిని ప్రజలు సద్వినియోగించుకోవాలని ఆశాఖ ఏఎస్పీ మదన్‌మోహన్, ఐపీపీబీ జనగామ బ్యాంక్ మేనేజర్ రమేశ్ కోరారు. మంగళవారం దూళ్మిట్ట మండలంలోని కూటిగల్‌లో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తపాలాశాఖలో సేవింగ్ బ్యాంక్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లతోపాటు ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకులో రూ.555లకు రూ.10లక్షలు, రూ.749లకు,15లక్షల ప్రమాద బీమా ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిత, బ్రాంచ్ పోస్టుమాస్టర్లు ప్రవళిక, నర్సింహులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానం వద్దు



ఎంపికైన వారిని అభినందిస్తున్న నేతలు

సిద్దిపేటకమాన్: నూతన విద్యావిధానం వద్దు, కామన్ విద్యా విధానాన్నే అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులు అనిల్, మన్నె కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏఐపీఎస్‌యూ రాష్ట్ర స్థాయి విద్యావైజ్ఞానిక శిక్షణ తరగతులు విజయవంతంగా ముగిశాయన్నారు. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో సర్వేలు, శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను పునర్నిర్మించాలని పోరాటానికి రూపకల్పన చేసినట్లు తెలిపారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, సంక్షేమ హాస్టళ్లకు మెస్, కాస్మొటిక్ చార్జీలను పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి రాములు, ఏఐపీఎస్‌యూ నాయకులు సాయి, నగేశ్, రవి, శేఖర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి గ్రామస్తుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి నుంచి పెద్దరాజుపేట వరకు బీటీరోడ్డు నిర్మించాలని, మాధవరెడ్డి డ్యామ్, బయన్న చెరువులను తపాసుపల్లి రిజర్వాయర్ ద్వారా నింపాలని పోతిరెడ్డిపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు, శ్రీనివాస్‌రెడ్డి, గర్నెపల్లి చంద్రం, అరెపల్లి లక్ష్మణ్, వెంకట్‌రెడ్డి, కనకయ్య, బాల్‌రెడ్డి, కుమార్, నవీన్ తదితరులు ఉన్నారు.

బాధితులకు అండగా నిలుద్దాం
– రైతు సంఘం రాష్ట్ర నేత శోభన్

కొమురవెల్లి(సిద్దిపేట): కేరళ వరద బాధితులకు అండగా నిలుద్దామని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ శోభన్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని దుకాణాలలో మంగళవారం ఆయన విరాళాలు సేకరించారు. అనంతరం మాట్లాడుతూ కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనలో సుమారు 300 మంది ప్రాణాలు కోల్పోయారని, వందలాది మంది ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారన్నారు. వారికి ప్రతిఒక్కరు అండగా నిలువాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సత్తిరెడ్డి, యాదవరెడ్డి, కృష్ణారెడ్డి, రవీందర్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇటువైపు రాకోయ్.. 'అతిథి'



నిరుపయోగంగా అతిథి గృహం

మండల పరిధిలోని అనంతసాగర్‌లో సరస్వతీక్షేత్రం వద్ద పర్యాటకశాఖ భక్తుల సౌకర్యార్థం లక్షలు వెచ్చించి గెస్ట్‌హౌస్ నిర్మించింది. నిర్వహణ బాధ్యత ఎవ్వరూ తీసుకోకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. లక్షలు వెచ్చించి నిర్మించినా అధికారులు, ప్రజా ప్రతినిధులు భవన నిర్వహణ బాగోగులు మర్చిపోయారు. దీంతో ఆకతాయిలకు అడ్డాగా మారింది.

– చిన్నకోడూరు(సిద్దిపేట)

దుర్గంధం.. ప్రయాణికులకు కష్టం



పిచ్చి మొక్కలు, పొదలతో నిండిన డ్రైనేజీ



చెత్తాచెదారంతో నిలిచిపోయిన మురుగునీరు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల చౌరస్తాలోని బస్‌స్టాప్ వద్ద ఉన్న మురుగు కాలువ వెదజల్లే దుర్గంధం ప్రయాణికులకు, పక్కనే ఉన్న ఓపెన్ జిమ్‌కు వచ్చే ప్రజలకు నరకప్రాయంగా మారింది. ప్రధాన చౌరస్తాలోని మురుగు కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయింది. పిచ్చిమొక్కలు, పొదలు ఏపుగా పెరిగాయి. డ్రైనేజీ నిర్వహణ సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

40క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని ఎల్లారెడ్డిపేట వద్ద 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ఓ ఆటోను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, తొగుట పోలీసులు మంగళవారం సాయంత్రం పట్టుకున్నారు. ఆటోను స్వాధీనం చేసుకుని బియ్యాన్ని తరలిస్తున్న ఆలపు రాజు, సోలంకి సంతోష్, కస్తూరి చింటు, గొల్లన రవిని అదుపులోకి తీసుకున్నారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వారికి కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పలు ప్రాంతాల్లో నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎనిమిది మంది పట్టుపడగా వారిని మంగళవారం కోర్టులో హాజరుపరిచామని, న్యాయమూర్తి విచారించి రూ.7,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థులే భవిష్యత్‌కు మార్గదర్శులు



దుబ్బాకటౌన్: ఐడీ కార్డులు, బెల్టులతో విద్యార్థులు

● ఎంఎల్‌సీ రఘోత్తంరెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): విద్యార్థులే దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులని ఎంఎల్‌సీ రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని పీడీ మాలతి కుమారులు అందించిన స్పోర్ట్స్ యూనిఫాంలను మంగళవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. పీడీగా పనిచేస్తున్న మాలతి కుమారులు చేస్తున్న కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకుని ఆదర్శంగా నిలవాలని సూచించారు. మాలతి సురేందర్‌రెడ్డి దంపతులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీరాములు, పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

దుబ్బాకటౌన్: విద్యార్థులు పట్టుదల, ఏకాగ్రతతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెల్లాపూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ ఆకాంక్షించారు. పాఠశాలలో ఎన్‌ఆర్‌ఐ శ్రీరామ్ ప్రతాప్ సౌజన్యంతో మంగళవారం 150 మంది విద్యార్థులకు బెల్టులు, ఐడీ కార్డులను పంపిణీ చేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతాప్ విదేశాల్లో ఉంటున్నా పుట్టిన మాతృభూమి కోసం సేవా కార్యక్రమాలు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, రవీందర్, శ్రీరాజ్, రమేశ్ తదితరులున్నారు.

హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్‌కు ఇవ్వొద్దు

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి డిమాండ్
● మధ్యాహ్న భోజన కార్మికుల వినతి



మిరుదొడ్డి(దుబ్బాక): వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

మిరుదొడ్డి(దుబ్బాక)/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్‌కు ఇచ్చే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఉప సంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాల స్వామి డిమాండ్ చేశారు. ఆ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ మంగళవారం మిరుదొడ్డి తహసీల్దార్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ వీరేశ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో స్వచ్ఛంద సంస్థలకు మధ్యాహ్న భోజన పథకాన్ని అప్పగించడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందలేదని, మళ్లీ అదే తరహాలో వ్యవహరించడం సరి కాదన్నారు. కార్యక్రమంలో అంజయ్య, సత్తిరెడ్డి, పద్మ, కొండవ్వ, రాజేశ్వరి, లావణ్య, భాగ్యమ్మ, లత తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సిద్దిపేట మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన, ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కార్మికులు కిష్టవ్వ, లింగవ్వ, స్వప్న, స్వరూప, పద్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం..

● పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో శశిధర్‌శర్మ

వర్గల్(గజ్వేల్): ఎస్‌జీటీ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తామని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఆదరాసుపల్లి శశిధర్‌శర్మ చెప్పారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో మండల ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 11, 12 జీఓల సవరణ, 5,600 ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి సంఘం కృషిచేస్తోందన్నారు. సీపీఎస్ రద్దు కోసం కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులు, ఉచిత కరెంటు జీఓలు తమ సంఘం ద్వారానే సాధ్యమయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో సుభాష్ చందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, నరసింహారెడ్డి, ప్రశాంత్ కుమార్, శ్రీపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందాలి

● చైర్‌పర్సన్ గన్నె వనితారెడ్డి



దుబ్బాక: చెక్కును అందజేస్తున్న చైర్‌పర్సన్ వనిత

దుబ్బాక/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/మిరుదొడ్డి(దుబ్బాక)/జగదేవ్‌పూర్(గజ్వేల్): పేదలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందినప్పుడే వారి జీవితాల్లో వెలుగులు నిండుతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితారెడ్డి అన్నారు. మంగళవారం 18వ వార్డులో బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు తిరుపతి, బీఆర్‌ఎస్ నాయకులు మధు, దుబ్బయ్య, పుష్పాంజలి తదితరులు ఉన్నారు. ప్రశాంత్‌నగర్ పరిధిలోని బక్రీచెప్యాల గ్రామానికి చెందిన కొత్తపల్లి యాదగిరికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2లక్షల ఎల్‌ఓసీని పూజల హరికృష్ణ అందించారు. ఆయన వెంట ముద్దం లక్ష్మి, అనిల్ యాదవ్, షాబుద్దీన్, వనజ, మాడుగుల రాములు, పిండి అనిల్ కుమార్, వెలికట్ట శ్రీను తదితరులు పాల్గొన్నారు. మిరుదొడ్డి మండల పరిధిలోని అల్వాలకు చెందిన చెర్ల మల్లయ్య, దర్శనం మమతకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మాజీ వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు అందజేశారు. మాజీ కో ఆప్షన్ మెంబర్ ఎండీ అహ్మద్, ప్రసాద్, సుధాకర్, నాగరాజు, చెన్నాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని మందాపూర్ గ్రామానికి చెందిన లింగాని యాదగిరికి మంజూరైన రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు అందజేశారు. కార్యక్రమంలో పరమేశ్వర్, రాము, నరేశ్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌కు అంతరాయం

మర్కూక్(గజ్వేల్)/వర్గల్(గజ్వేల్)/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మండలంలోని గణేశ్‌పల్లిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ సుధీర్ తెలిపారు. గణేశ్‌పల్లి నుంచి అక్కారం మిషన్ భగీరథ పంప్‌గౌస్ వరకు నూతన లైన్‌లు వేయడంతో ఉదయం 10నుంచి 2గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. అదేవిధంగా వర్గల్‌లో నూతనలైన్‌ల నిర్మాణం పనుల్లో భాగంగా మండలంలోని మీనాజీపేట, తున్కిమక్త, అంబర్‌పేట గ్రామాలకు ఉదయం 11నుంచి 2వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. చెట్టకొమ్మల తొలగింపు పనుల వల్ల ప్రశాంత్‌నగర్‌లోని 11కేవీ భారత్‌నగర్ ఫీడర్‌ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత్‌నగర్, గణేశ్‌నగర్, వివేకానంద చౌరస్తా ఏరియా, రైతుబజార్, అంబేద్కర్ చౌరస్తా ప్రాంతాలలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

షీ టీమ్ ఫిర్యాదుల బాక్స్

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గ హైస్కూల్ ఆవరణలో మంగళవారం పోలీసులు షీ టీమ్ ఫిర్యాదుల బాక్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్టేషన్ ఎస్‌ఐ దుర్గ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని చెప్పారు. విద్యార్థినులను ఎవరైనా అవమానపరచినా, వేధించినా వారి పేర్లను రాసి ఫిర్యాదుల బాక్స్‌లో వేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం భైరయ్య, షీ టీమ్ పోలీసులు పాల్గొన్నారు.

పంచాయతీగా రామసాగర్

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దాచారం శివారులోగల రామసాగరం ప్రత్యేక గ్రామ పంచాయతీగా మారనుంది. మంగళవారం ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. రామసాగరంలో 65 గృహాలు, 400 జనాభా, 250 ఓటర్లు ఉన్నారు. ప్రత్యేక పంచాయతీగా మారడంతో గ్రామస్తులు బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులను కాపాడండి



గజ్వేల్‌రూరల్: ర్యాలీలో పాల్గొన్న ఐక్యవేదిక నేతలు

● హైందవ సంఘాల భారీ ర్యాలీ, ఆర్డీఓకు వినతి

గజ్వేల్‌రూరల్/సిద్దిపేటకమాన్/గజ్వేల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టి వారిని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని గజ్వేల్‌లో హైందవ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంగడిపేట హనుమాన్ దేవాలయం నుంచి ఇందిరాపార్కు చౌరస్తా మీదుగా కోర్టు వరకు తిరిగి అక్కడి నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ చేపట్టారు. బంగ్లాదేశ్‌లో హిందువులను కాపాడండి, జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, సామాజిక సమరసతా వేదిక రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు తదితరులు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామన్నారు. అనంతరం ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. హైందవ సంఘాల ఐక్యవేదిక పిలుపుమేరకు పట్టణంలో పలు వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు మూసి బంద్ పాటించారు. గజ్వేల్ ఆర్యవైశ్య ప్రముఖుడు దూబకుంట ప్రభాకర్, రామకోటి భక్త సమాజం అధ్యక్షుడు రామకోటి రామరాజు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండించాలన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు స్పందించడంలేదని వాపోయారు. కార్యక్రమంలో రామచంద్రం, రాంఫణిధర్‌శర్మ, ఉమేశ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా గ్రామసభ

● నిలిచిన రోడ్డు పనులపై వాగ్వాదం
● అధికార, ప్రతిపక్ష నేతల తోపులాట



గ్రామసభలో గొడవ పడుతున్న నాయకులు

కొండపాక(గజ్వేల్): గ్రామంలో నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనుల విషయంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమై రెండేళ్లు గడుస్తున్నా పూర్తి కాకపోవడాన్ని గ్రామస్తులు గ్రామసభ దృష్టికి తెచ్చారు. అలాగే ఇళ్లు, స్థలాలు కోల్పోయిన వారందరికీ డబుల్ బెడ్రూం అవకాశం కల్పించలేదన్న విషయాన్ని సైతం సమావేశం దృష్టికి తెచ్చారు. కాంట్రాక్టర్ రోడ్డు పనులు సగంలో ఆపివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో పనులు ఆగిపోయాయంటూ ప్రతిపక్షపార్టీ నాయకులు ఆరోపించడంతో అధికార పార్టీ నాయకులకు, ప్రతిపక్ష నాయకులకు మాటామాటా పెరిగి తోపులాటకు దారితీసింది. దీంతో కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి అమీనాబేగం మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులు తొందరగా పూర్తయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయితీరాజ్ శాఖ ఈఈ చిరంజీవచారి, డిప్యూటీ ఈఈ అజయ్‌కుమార్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కుక్కకాటుతో ఆవు మృతి**

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని గాంధీనగర్‌లో మంగళవారం కుక్కకాటుకు బలైన ఓ పాడిఆవు మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మొండయ్య అనే రైతు తన పాడిఆవు రేబీస్ లక్షణాలతో మరణించినట్లు చెప్పాడు. కుక్కలు, కోతులు బెడద నుంచి కాపాడాలని, రైతుకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

◆ **ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చండి**

సిద్దిపేటకమాన్: వెనుకబడిన ముదిరాజులను బీసీ డీనుంచి బీసీ ఏలోకి మార్చాలని ముదిరాజ్ సంఘం నేతలు జంగిటి శ్రీనివాస్, ధర్మ, మిట్టపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. లక్ష్మణ్, నవీన్, నర్సింహులు, ధర్మ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరామన్ కమిషన్ సూచించిన విధానాన్ని యథాతథంగా అమలు చేయాలని బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు.

◆ **కాంగ్రెస్ అంటేనే కొర్రీల పార్టీ**

గజ్వేల్: కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే కొర్రీల పార్టీ అని, అబద్ధాలతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ వివిధ సాకులతో హామీలను అమలు చేయకుండా తప్పించుకునే ప్రయత్నంలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు.

◆ **జాతీయ జెండా ఎగురవేయాలి**

హుస్నాబాద్‌రూరల్/మిరుదొడ్డి(దుబ్బాక): దేశ సంస్కృతిని సాటి చెప్పేందుకు ప్రతిఇంటా జాతీయ జెండా ఎగరాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు లక్కిరెడ్డి తిరుమల అన్నారు. మంగళవారం పందిల్లలో హర్‌ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహిళా మోర్చా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. మిరుదొడ్డిలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా యాత్రలో భాగంగా కుమ్మరి సురేశ్, పెద్ద కుర్మ కరుణాకర్ దేశ నాయకుల విగ్రహాలను శుభ్రపరిచి నివాళులర్పించారు.

◆ **దాడులపై స్పందించాలి**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వాలు స్పందించి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని తపస్ జిల్లా అధ్యక్షుడు ఊడెం రఘువర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల పేరుతో హిందువులపై దాడిచేసి వారి ధన, మాన, ప్రాణాలను దోచుకుంటున్నారన్నారు. మురళీ, వైపీ శశికుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.

◆ **ర్యాలీకి తరలివెళ్లిన ఎమ్మార్పీఎస్ శ్రేణులు**

హుస్నాబాద్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హైదరాబాద్‌లో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ర్యాలీ, దండోరా విజయోత్సవ సభకు మంగళవారం నియోజకవర్గ శ్రేణులు తరలివెళ్లాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధించి హైదరాబాద్‌కు వస్తున్న మంద కృష్ణకు స్వాగతం పలికేందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో హరీశ్, లక్ష్మీనారాయణ, థామస్, వెంకటస్వామి తదితరులు ఉన్నారు. ప్రశాంత్‌నగర్‌లో శ్రీనివాస్, పరశురాములు, బాబు తదితరులు పాల్గొన్నారు.

◆ **మట్టి తరలిస్తున్న టిప్పర్లు స్వాధీనం**

కొండపాక(గజ్వేల్): తిమ్మారెడ్డిపల్లిలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు టిప్పర్లను మంగళవారం తహసీల్దార్ దిలీప్ నాయక్ పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తుండడంతో టిప్పర్లను కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్లో అప్పగించినట్లు తహసీల్దార్ తెలిపారు.

◆ **మహిళా కార్యవర్గం ఎన్నిక**

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాలలో గాజుల వ్యాపారం చేసుకునే మహిళలు మంగళవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా కావేటి కనకవ్వ, ఉపాధ్యక్షురాలిగా మౌనిక, ప్రధాన కార్యదర్శిగా కావేటి భాగ్య తదితరులు ఎంపికయ్యారు.

◆ **బిల్లులు రాక ఇబ్బందులు**

జగదేవపూర్(గజ్వేల్): గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని, వాటిని వెంటనే అందజేయాలని ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు ఎంపీడీఓ యాదగిరికి వినతిపత్రం అందజేశారు.

◆ **సీజనల్ వ్యాధులపై అవగాహన**

గజ్వేల్‌రూరల్: సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని శ్రీగిరిపల్లి వైద్యాధికారి డాక్టర్ బల్వీర్‌సింగ్ పేర్కొన్నారు. 5వ వార్డులో మంగళవారం ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. వాసుదేవ్, నాగరాజు, రమేశ్, దీవెనమ్మ, జుబేదాబేగం, రజని తదితరులు పాల్గొన్నారు.

◆ **పోలీసుల 'కనువిప్పు'**

ములుగు(గజ్వేల్): గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ విజయ్‌కుమార్ సూచించారు. వంటిమామిడిలో నిర్వహించిన కనువిప్పు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.